

# దేశమంటే...

'నిశాపతి'

**"మనం ఇక్కడినుంచి బయలుదేరవలసిన సమయం 'టెన్'. ఇప్పుడు 'టెన్ టూ'! అన్నాడు 'స్మాల్' వాచీ చూసుకుంటూ చిరాగ్గా - తప్పుపడుతున్నట్లు.**

భాస్కర్‌కి అతడు మాట్లాడేదేమిటో అర్థం కావడానికి మరో రెండు నిమిషాలు పట్టింది. అర్థం అయ్యాక కూడా అతను ఆశ్చర్యం నుండి తేరుకోలేకపోయాడు. స్మాల్ 'టెన్ టూ' అన్నది 'పదిగంటలా రెండు నిమిషాలు' అన్న అర్థంలో అని జీర్ణించుకోలేకుండా ఉన్నాడు.

'రెండు నిమిషాలు! ముష్టి రెండు! బోడి రెండు!! అవీ గంటలు కాదు, నిమిషాలు! దానికే ఇంత ఇదా?' అనుకున్నాడు భాస్కర్.

స్మాల్ బ్రిటిష్ దేశస్థుడు. భారత్‌లో తాగునీటి వల్ల కలిగే ఫ్లోరోసిస్ వ్యాధి నివారణకి శిశుసంరక్షణ నిధి తాలూకు సహాయంతో అమలయ్యే కార్యక్రమంలో స్మాల్ ఆధ్వర్యం వహిస్తోన్న ప్రాజెక్ట్ ఓ భాగం.

భారత్‌లో ఆ శాఖ తాలూకు సీనియర్ ఇంజనీర్ భాస్కర్. పదిరోజులబట్టీ స్మాల్‌ని వెంటేసుకుని తిప్పుతున్నాడు అతను. ఈ పదిరోజుల్లో 'మిస్టర్ బర్లింగ్‌టన్' అనే ఫార్మాలిటీని అధిగమించి, స్మాల్ అని ఫస్ట్‌నేమ్‌తో పిలిచే చనువు ఏర్పడింది భాస్కర్‌కి అతనిదగ్గర.

అయితే ఎంతయినా ఇచ్చేవాడు ఇచ్చేవాడే, పుచ్చుకునేవాడు పుచ్చుకునేవాడే!

స్మాల్ గనక ఇంప్రెస్ కాక, ఆ ఆరొందల కోట్ల రూపాయల ప్రాజెక్ట్ మన రాష్ట్రానికి రాకపోతే భాస్కర్‌కి వచ్చే ప్రమోషన్ కాస్తా ఆగిపోతుంది.

అందుకే స్మాల్ మెప్పుకోసం పడుతూ లేస్తూ కరెక్ట్ టైమ్‌కి వస్తే ... చివరికి ...

భాస్కర్‌లోని సగటు భారతీయుడికి ఒక ఐడియా కూడా వచ్చింది. 'ఆ రెండు నిమిషాల తేడా మన వాచీల్లో ఉంది. నేను సరైన టైముకే వచ్చాను!' అందామనుకున్నాడు. కానీ క్రితంరోజు విడిపోయేటప్పుడు స్మాల్ తన వాచీని భాస్కర్ వాచీతో సింక్రనైజ్ చేసుకోవడం గుర్తొచ్చి ఆ ఆలోచన మానుకున్నాడు.

స్మాల్ అసహనంగా ... "ఇంకా ఏమిటి ఆలోచిస్తున్నావు? ఎక్కు!" అని తొందరపెట్టాడు.

* * *

ఉభయ దేశాలకి చెందిన ఓ చిన్నపాటి బృందం ఆ టెంపోలో ఉంది.

ఒక గ్రామంలో ఫ్లోరైడ్ శాతం చాలా ఎక్కువగా ఉంది. అసలు వుండవలసింది ఒకటిన్నర యూనిట్లు. రెండున్నరా, మూడు వరకు దంతాల ఫ్లోరోసిస్ వస్తుంది. అంటే పళ్లపై గార. ఆ గార నిలువుగా కాక అడ్డంగా గీతలుగా ఏర్పడితే అది ఫ్లోరోసిస్‌కి గుర్తు. ఆ హద్దు దాటితే ఎముకల ఫ్లోరోసిస్ వస్తుంది. నీటిలో ఫ్లోరైడ్ పరిమాణం ఎంత ఎక్కువగా ఉంటే ఆ జబ్బు తీవ్రత అంత ఎక్కువగా ఉంటుంది.

ఆ ఊళ్లో ఏడు యూనిట్లు ఉంది.

అక్కడ నడుం బిగిసిపోయినవాళ్లూ, కాళ్లు పూర్తిగా వంకరతిరిగిపోయిన వాళ్లూ లెక్కలేనంత మంది ఉన్నారు. ఆకాశంలో విమానం వెడుతుంటే దాన్ని చూడ్డానికి వాళ్లు గబగబా మంచం వాల్చుకుని, దానిమీద వెల్లకితాల పడుకుంటారు.

భాస్కర్ ముందుగానే వాళ్లకి శిక్షణ ఇచ్చి, వీళ్ల వెళ్లేసరికి అందరూ పంచాయితీ ఆఫీసు దగ్గర సమావేశం అయ్యేలా ఏర్పాటు చేశాడు.

టెంపో ఆగగానే ఆ జనం అంతా దాని చుట్టూ మూగారు. ఆఫీసర్లు దిగగానే వాళ్ల చేతుల్లో కెమేరాలు చూసి, ఫోటో తీయించుకోవడం కోసం ఎగబడ్డారు. వాళ్లని చూస్తే చాలా జాలేసింది స్మాల్‌కి.

"మీ దేశం గొప్పదే గానీ, మీ మనుషులు గొప్పవాళ్లు కారోయ్! మొన్న నువ్వు చెప్పావే, మీ కవి ఎవరో - దేశం అంటే మట్టి కాదు, మనుషులని - అన్నాడని. అప్పుడు నాకు అర్థం కాలేదు, ఇంత స్పష్టమైన విషయాన్ని ఒక కవి పనిగట్టుకుని ఎందుకు చెప్పవలసివచ్చిందో! కానీ ఇప్పుడు అర్థం అవుతోంది. మీకు దేశం అంటే మట్టి అనుకోవడమే 'కన్వీనియంట్!' దానికోసం అయితే ఏమీ చెయ్య క్కర్లేదు!" అన్నాడు స్మాల్. అతని కళ్లల్లో తడి.

భాస్కర్‌కి కోపంతో మొహం ఎర్రబడింది.

"మరీ సెంటిమెంటల్‌గా మాట్లాడకు! మీ దేశంలో ఏమీ జబ్బులు లేవా? ఉంటే మరి మీరూ మనుషుల్ని పట్టించుకోనట్లేగా? మేం ఇంకా నయం గదూ, కనీసం మట్టినైనా పట్టించుకుంటున్నాం, మీలా డబ్బు వెనక పరుగులు పెట్టకుండా! మా దేశమూ గొప్పదే! మా మనుషులూ గొప్పవాళ్లే! నువ్వేం జడ్జిమెంట్లు ఇవ్వక్కర్లేదు. మా దేశంలో అన్ని జబ్బులకీ మూలం ఒక్కటే! దాని పేరే పేదరికం. అయితే దానికి ఉపశాంతి కలిగించే మందు కూడా మా దేశంలోనే ఉందిలే! దాని పేరే సంతృప్తి! అదే మా బలమూ, బలహీనతా - రెండూనూ!" అన్నాడు.

స్మాల్ నవ్వాడు. "ఆ మాత్రం దేశభక్తి ఉండాలనుకో! అయినా మీ దుస్థితికి కారణం కేవలం ఆర్థిక పరమైనదేనంటావా?" అని ఎదురు ప్రశ్న వేశాడు.

"కాక?"

"మీ అలసత్వం కూడానేమో!"

"అలా అయితే దానికీ మీరే కారణం. మీ బ్రిటిషు వాళ్లు పరిపాలించినప్పుడు రక్తంలోకి ఎక్కించిన నలత్రమిది. మీది పరాయిప్రభుత్వం. 'నేను, నా దేశం' అనే ప్రేమ మీకు లేదు. ఎందుకుంటుంది? మీకు లాభాపేక్ష తప్ప ప్రజాక్షేమం పట్ల ఆసక్తి లేదు. మీ కొలువులో బ్యూరోక్రాట్లు కూడా అదే ఆలోచనా విధానానికి బానిసలు. మేం ఇప్పుడు వాళ్ల వారసులం.'

"ఇప్పుడు సెంటిమెంటల్‌గా మాట్లాడ్డం నీ టర్న్ కాబోలు! ఎప్పుడో యాభైఏళ్లనాటి సంగతులు తీసుకువచ్చి వాదాన్ని పక్కదారి పట్టిస్తున్నావ్. పబ్లిక్ విధులు నిర్వహించే అధికారులు ప్రజల్ని 'నావాళ్లు, నా గడ్డ బిడ్డలు' అని అక్కున చేర్చుకుంటే తప్ప అభ్యుదయం సాధ్యం కాదనుకోవడం చాలా అశాస్త్రీయమైన ఆలోచన. ఉద్యోగులుగా మనపని మనం చేసుకుంటూపోతే అభివృద్ధి అనేది మనకి తెలీకుండానే వస్తుంది. అది సరే, దేశం దేశం అంటున్నావ్ ఇందాకటినుంచీ - అసలు ఆ 'నా దేశం' అన్న భావం మీలో కలగడం కూడా బ్రిటీష్ పాలన చలవే! అంతకుముందు మీకు 'రాజ్యాలే' కానీ, 'దేశం' ఎక్కడ ఉంది?" అన్నాడు స్మాల్.

"నిజమే! మీ పాలనకి పూర్వం మాలో రాజకీయ ఐక్యత లేదు. కానీ దాన్ని మించిన సాంస్కృతిక ఐక్యత ఉంది. సముద్రాలూ, నదులూ, ఆచారాలూ, కాశీ రామేశ్వరాలూ మమ్మల్ని ఒకటిగా కట్టిపడేశాయి. భారతీయులు మీ ప్రభుత్వాన్ని పరాయిదాన్నిగా భావించడానికి కారణం మీరు పరాయి దేశస్థులు కావడం కాదు. మీ కంటే ముందే ఎందరో పరాయి దేశస్థులు ఈ దేశానికి వచ్చారు. పాలించారు. అలా పాలిస్తూనే వాళ్లు ఈ దేశ సంస్కృతిలో ఒక భాగమయ్యారు. మేం వాళ్లని 'యాక్సెప్ట్' చేశాం. మీరలా కాదు, మీది రిమోట్ కంట్రోల్. ఈ మాటలంటోంది నేను కాదు, బోలెడు సంవత్సరాల క్రితం జవహర్‌లాల్ నెహ్రూగారు అన్నారు. అయినా నీ వాదంలో ఒక పాయింట్ ఉంది. ఇవన్నీ యాభై ఏళ్లనాటి సంగతులు. ఒక జాతి అభివృద్ధి చెందాలంటే యాభై ఏళ్లు తక్కువ కాలం కాదు. మరి మా వెనకబడినతనానికి కారణాన్ని గురించి నీ ఎనాలసిస్ ఏమిటి?" అన్నాడు భాస్కర్.

"వద్దులే, చెబితే నీకు కోపం వస్తుంది!"

"రాదులే, చెప్పు!"

"మీలో విధి నిర్వహణ పట్ల సిన్సియారిటీ లేదు. ఐ మీన్ నో అఫెన్స్! ఇందాక నువ్వు రెండు నిమిషాలు ఆలస్యంగా వచ్చి అదో పెద్ద విషయం కానట్లు మొహం పెట్టావే! అదే! అదే నేను చెప్పిన దానికి చిన్న ఉదాహరణ. నువ్విప్పుడు మనసులో ఏమనుకుంటున్నావో చెప్పనా- 'ఇతనెవరు? తనకేదో నేను ఎకౌంటబుల్ అన్నట్లు నిలదీస్తాడు?' అని. నువ్వు ఎవరికి ఎకౌంటబుల్ అన్నది ఆలోచించావు కానీ, నీకు నువ్వే ఎకౌంటబుల్ అన్న ఆలోచన నీ మనసులోకి రాలేదు. నీలాగా ఒక్కొక్క వ్యక్తీ వ్యర్థం చేసే పనిగంటలు క్యుములేటివ్‌గా మీ దేశపు వెనకబాటుతనానికి కారణం అవుతాయని నీకు తట్టలేదు. ఆలోచించు! ఐ థింక్ ఐ మేవ్ మేడ్ మై పాయింట్!" అన్నాడు స్మాల్.

"యు మేడ్ నథింగ్! రెండు నిమిషాలు ఆలస్యం

కావడం దేశభక్తి లేకపోవడం అని ఆరోపించడం టూమచ్!"

"ఆలస్యం చేయడం కాదు, అందుకు గిల్టీగా ఫీల్ కాకపోవడం. ఆల్‌రైట్! నేను ఇంకో ఉదాహరణ ఇస్తాను, విను!"

"ఏమిటి?"

"నువ్వు రాకముందు మీ ఆఫీసులో ఒకతన్ని నిన్న తను ఇచ్చిన పర్టిక్యులర్స్ గురించి చిన్న వివరణ అడిగాను."

"ఊఁ."

"అతను ఏదో చెప్పాడు. నేను కన్విన్స్ కాలేదు."

"ఊఁ."

"డోన్ట్ లై! గివ్ మీ ది రియల్ లోడౌన్! - అన్నా ను. అంతే! అతను చాలా సీరియస్ అయిపోయాడు. 'వై షుడ్ ఐ లై సర్? ఇటీజ్ నాట్ మై పర్సనల్ థింగ్!' అన్నాడు. చూశావా? దీన్ని బట్టి ఏం అర్థమవుతోంది. సొంతానికైతే అబద్ధం ఆడతాడుకానీ, దేశంకోసం, దేశానికి మేలు జరుగుతుందంటే ఒక చిన్న త్యాగం - చిన్నపాటి అబద్ధం ఆడేటంత త్యాగం కూడా చెయ్యడానికి సిద్ధంగా లేరు మీరు. ఇక మీకు దేశమంటే మట్టిగాక మరేమిటి? సారీ ఫర్ బీయింగ్ హార్ష్" అన్నాడు స్మాల్.

భాస్కర్ కోపంగా, "శత్రుస్థావరాన్ని నాశ నం చెయ్యడానికి తను ఉన్న ప్లేన్‌తోనే బొంబార్డ్ చేసిన ఆర్మీ ఆఫీసర్లున్న జాతి మాది!" అన్నాడు.

స్మాల్ వదల్లేదు. "సైన్యంలో అలాంటివాళ్లు అన్ని దేశాల్లోనూ ఉంటారు. సామాన్యపౌరుల్లో ఆ బిలాంగింగ్‌నెస్ వచ్చినప్పుడే దేశం ముందు కెళ్తుంది అనుకుంటాను!" అన్నాడు.

ఇది ఇలా ఎంతసేపు సాగేదో!

భాస్కరే ముందుగా తేరుకుని, "సరే కానీ, ముందు ఇది చెప్పు. మా దేశం గురించి నీకు ఎందుకింత కన్‌సర్న్?" అన్నాడు.

"ఎందుకంటే మా అమ్మమ్మ భారతీయు రాలు కాబట్టి. మా చిన్నతనంలో రోజూ కథలు గా చెబుతూండేది. మీ దేశం- ఋషులూ, వేదాలూ, హిమాలయాలూ, వాల్మీకీ, కాళిదాసూ, గంగానదీ, పండగలు ... ఎన్నో ... అవన్నీ వినీ వినీ నేను భారతదేశం అంటే ఒకరకమైన ఫాసినేషన్ పెంపొం దించుకున్నాను!" అన్నాడు స్మాల్.

"అదీ! అలా చెప్పు! నీలో భారతీయరక్తం ప్రవ హిస్తోంది. అందుకే ..."

"దట్ విల్ డు!" అసహనంగా అన్నాడు స్మాల్. "ఇలా ప్రతిదానిలోనూ లేనిపోని గొప్పతనం ఊహించు కోవడం ముందు మానెయ్యండి మీరు!'


భాస్కర్ హఠాత్తుగా టాపిక్ మారుస్తూ, "మనం మన ఫీల్డ్ వదిలి చాలా దూరం వచ్చేశామేమో!" అన్నాడు.

'యుఆర్ రైట్ ఎట్‌దట్!" అన్నాడు స్మాల్. 'వెళ్లి, ఫ్లోరోసిస్ రోగుల్ని ఇంటర్వ్యూ చేద్దాం పద!'

* * *

ఒక్కొక్కళ్లనే ప్రశ్నలు అడుగుతున్నాడు భాస్కర్ తెలుగులో. అన్నీ రొటీన్ ప్రశ్నలు - 'నీకు ఈ జబ్బు ఎప్పటినుంచీ ఉంది? ఇది నీటి వల్ల వచ్చింది అని నీకు తెలుసా?' ... ఇలాంటివి.

జబ్బు ముదిరినవాళ్లలో ఆడవాళ్లూ ఉన్నారు, మగవాళ్లూ ఉన్నారు. ఆడవాళ్లలో ఎక్కువమంది ఆ ఊళ్లో పుట్టి పెరిగిన పిల్లలు. అక్కడికి కోడళ్లుగా వచ్చిన వారిలో ఆ జబ్బు అంతగా లేదు - వాళ్ల బాల్యం వేరే ఊళ్లో గడిచింది కనుక.



భాస్కర్ మరో విషయం కూడా గమనించాడు. ఆ ఊళ్లో పుట్టిన ఆడపిల్లల్లో ఏళ్లు ముదిరినా, పెళ్లి కాని వాళ్లు ఒకవైపూ, పెళ్లైనా భర్త వదిలస్తేపుట్టింటికి చేరినవాళ్లు ఓవైపూ ఎక్కువగా కనిపించారు. రెం డింటికీ కారణం ఈ జబ్బే!

ఒక్కొక్కళ్ల బయోడేటా పరిశీలిస్తున్నాడు స్మాల్. మధ్యలో హఠాత్తుగా తలెత్తి ఓ అమ్మాయిని వేలెత్తి చూపిస్తూ - "ఈమె భర్త వదిలేసిన అమ్మాయన్నావు. మరి ఈమె మెళ్లో ఆ 'డిస్క్ థ్రెడ్' వేలాడుతోందేం?' ' అన్నాడు.

భాస్కర్ ఒక్క క్షణం ఆలోచించి, "ఓఁ, మంగళ "సూత్రమా? అది తీసెయ్యరు. ఎక్కడైనా కొందరు స్త్రీలు వేరే మగాడిని పెళ్లాడినా దండలు మార్చుకుంటారు కానీ. ఆ మంగళసూత్రం తీసేసి ఇంకోటి కట్టుకోరు. అది భర్త చనిపోయినప్పుడు మాత్రమే తీసేస్తారు. అదీ మొదటిభర్త - దాన్ని కట్టినవాడు చనిపోయినప్పుడు మాత్రమే!" అన్నాడు.

"ఇంటెరెస్టింగ్!" అన్నాడు స్మాల్. కాసేపాగి, "అండ్ గ్రేట్!" అన్నాడు.

"ఎందుకు గ్రేట్? భర్త అనే ఓ వ్యక్తికంటే అతను బతికిఉండడం వల్ల వచ్చే కొన్ని భౌతికచిహ్నాల్ని గౌరవిం చడం గ్రేటా? మీ దేశంలో ఇదంతా పురుషాహంకార ఎంసీపీల కుట్ర అనుకుంటారు. నిజానికి నేనూ అలాగే అనుకుంటున్నాను!" అన్నాడు భాస్కర్.

స్మాల్ కాసేపు మాట్లాడలేదు. తర్వాత అన్నా డు - "నువ్వు చెప్పింది నిజమే కావచ్చు. ఇఫ్ యు లుక్ ఎట్ ఇట్ దట్ వే! కానీ నా మటుకి నాకు వివాహం అనే వ్యవస్థని మీరింత సీరియస్‌గా తీసుకోవడం చూస్తే ముచ్చటేస్తుంది!"

"వివాహవ్యవస్థని సీరియస్‌గా తీసుకోవడమా? మై ఫుట్! పిల్లలు అనే బంధమే అడ్డం లేకపోతే మా దేశంలో మూడొంతుల వివాహాలు ఎప్పుడో విచ్ఛిన్నమయ్యేవి" అన్నాడు భాస్కర్.

"ఎగ్జాక్ట్లీ! నేను చెప్పేదీ అదే! వివాహం ఆర్ రేదర్ ఫామిలీ అనే వ్యవస్థ మీ దేశంలో చాలా పటిష్టంగా ఉంది. మీ దేశంలో స్త్రీ భార్య గా తన స్థానాన్ని పెద్దగా పట్టించుకోదు. అదో టెంపరరీ ఫేజ్‌లా తీసుకుని, త్వరగా తల్లి అయి పోయి తన నిజమైన స్థానాన్ని పొందాలనుకుం టుంది. దెన్ షి గెట్స్ ట్రీటె డ్ యాజ్ ఎ వుమన్ రేదర్ దేన్ ఎ ఫిమేల్! అండ్ షి లైక్స్ ఇట్!"

"సరిపోయింది. పిచ్చి కుదిరింది రోకలి తలకు చుట్టమని' మా తెలుగులో ఒక సామెత ఉంది. ఓకే! మొత్తానికి పదిరోజుల్లో మా పిచ్చి నీకూ అంటుకుంది!" అంటూ నవ్వాడు భాస్కర్.

స్మాల్ కూడా నవ్వాడు.

* * *

తిరిగి వెళ్లాక తన సంస్థకి స్మాల్ ఇలా నివేదిక పంపాడు.

"భారత దేశానికి మన సంస్థ తప్పకుండా సా యం చెయ్యాలి. ఎందుకంటే మనది శిశువుల కోసం రూపొందింన సంస్థ. ఇండియా లో స్త్రీ పురుషులు ప్రధానంగా ఫాదర్ అండ్ మదర్! మన దేశాల్లోలా 'మాన్ అండ్ వైఫ్' కాదు. ఇలాంటి వాతా వరణంలో పెరిగే చిన్నారులు మంచి మానసిక ఆరోగ్యంతో పెరుగుతారు. భవిష్యత్తులో మనం ప్రపం చానికి ఒక గొప్పజాతిని అందించాలంటే ఇక్కడ రేపటి తరాన్ని కాపాడాలి..అవిద్యనుంచీ, అనారోగ్యం నుంచీ, ఆకలి నుంచీ, దరిద్రం నుంచీ ..."